దెయ్యం చల్లగా ఉండాలి గాని...

అవసరాల రామకృష్ణారావు

పున్నమ్మ కథ విన్నవాళ్ళెవరికైనా 'దెయ్యాలున్నాయా?' అనే సందేహం రానేరదు. పున్నమ్మ చచ్చి దెయ్యమయిందని కాదు. ఏ దెయ్యమో తగిన ధైర్యం చాలక తపస్సుచేసి బతికి పున్నమ్మ అయివుంటుంది.

జుత్తెప్పుడూ పున్నమ్మ విరబోసుకునే ఉంటుంది. కళ్ళెప్పుడూ ఆమెకు ఎర్రగానే ఉంటాయి. మనిషెప్పుడూ జోగుతూనే నడుస్తుంది. అక్షరాలా ఆమె ఆ యముడి భార్య. అందుకనే ఎనుబోతుల సహధర్మచారిణి అయిన గేదెల్ని సాకుతూ జీవిస్తూ ఉంటుంది.

రాజ్యాలయితే లేవుగాని నోరయితే ఆవిడకి పెద్దదే ఉంది. కొడుకయితే లేదుగాని 'మిస్. అండర్‌వరల్డు' లాంటి మేనగోడలు ఆమెని కనిపెట్టుకునే ఉంటుంది. దగ్గిరవాళ్ళంటూ లేకపోవచ్చునుగాని చేరదీసిన మనుషుల సంఖ్య ఏమంత తక్కువకాదు. ఇల్లయితే లేదుగాని ఆ వీధి బాగా విశాలంగానే ఉంటుంది. మొగుడయితే లేదుగాని మొగసాయానికి ఏ రాత్రీ మొగంవాచి ఎరగదు ఆసాధ్వి.

చూడకి ఒక్క చుక్క మిగల్చకుండా పాలు పిండుతూ యావత్ లోకం పాపాలు పిండుతున్నట్టు లెక్కేరివ్వగల సమదృష్టి ఆమెది. నీళ్ళు చాలకపోతే ఏ మొగుణ్ణో తలుచుకుని అప్పటికప్పుడు పీడ్చికన్నీళ్లు కార్చి అనుకున్న ఏ కొలతకైనా పాలు యివ్వగల యోగవిద్య ఆమెది. బయస్కోపు కెళ్ళినా భద్రాద్రికి బయల్దేరినా టిక్కెట్టుకొని ఎరగని స్వేచ్ఛాప్రవృత్తి ఆమెది.

'జాతి, మత, కుల, వర్గ భాషా విభేదాలు సంకుచితంగదా!' అనే సదుద్దేశంతో ఎవరింట్లో ఏ పాదు, తీగె బయటకి కనబడినా ఎగిరి కాయలూ పువ్వులూ తెంపుకునే సెక్యులర్ తత్వం ఆ యింటి పిల్లలిది.

'భూమీ, గాలీ, నీరూ, కాంతీ - ఇవి ఏ ఒక్కరిసొమ్మో అనుకోడం అన్యాయం గదా!' అనే విశ్వమయ ప్రేమతో ఎవరి పచ్చటి పొలం ఏ మూల కళ్ళబడినా ఎగిరి గంతేసి, ఎగబడి కుమ్మేసే కలుపుగోరు విధానం ఆ చూరు గేదెలది.

ఇంతకీ ఇల్లని భ్రమపడి చచ్చేదాకా యీ చూరుని పట్టుకుని వేళ్ళాడతాంగాని పున్నమ్మలాంటి లోకాతీతకి ఎంత జాగా కావాలి! ఆ వీధికి ఎడంచేతివైపు చివర, అన్నిటికీ ఆఖరుగావున్న ఖాళీ జాగాలో చిన్న పాకవేసుకుని జూనియర్ విక్టోరియాలా పున్నమ్మ 'పాలిస్తోంది!'

'పోనీ దిక్కులేని ఆడదానివి, నువ్వేదో యిల్లు ఏర్పాటు చేసుకుంటే మేం ఏమీ అనం. నీ గేదెల్ని వీధిలోకి ఊరిమీదకీ వదిలేస్తున్నావు. పబ్లిక్కి నానా న్యూసెన్సుగానూ ఉంది జాగర్త'

అని ఆమె దగ్గర పాలబాకీ పెట్టిన మునిసిపాలిటీ మునిముచ్చొకడు ఒకసారి నిలదియ్యడం జరిగింది.

'బాబ్బాబూ... కోరుటు కెల్దార నీ. సూనొద్దారనీ ఎన్నాల్లకాడ్నించో ఉందిరా కొడకా నాకు...ఓపాలి బేగి తీసికెల్లూ... అయితే ఒకటే ఆడపేనాన్ని ... ఒక్కత్తినీ రాలేను. నాకు పురుసతోడుగావాల. ఎవుడో దెల్సా? పక్కయీది కంటాకటరు కైలాసంగోడు నేడూ? ఎవుడు? నారీ ఓనరూ...ఆడూ నారీలన్నీ రిపేరుకని యీదిలోనే పేరుత్తాడు. ఆ బల్లు సేసే గోలకన్న మా గొడ్లు సేసేగొడవ ఎక్కవేంకాదు. మా కిద్దరికీ కలిపి చంకిల్లేయించరా కొడకా ... గల్లుగల్లుమని బయలెల్తాం జంటగా....ఈదంతా ఆరతులివ్వనేక పోటీలు పడేని!'

అని మళ్ళీ నోరెత్తకుండా పున్నమ్మ జవాబివ్వడమూ జరిగింది.

లారీలూ గేదెలూ వీధివాళ్ళకి ఎలా ఉన్నాయోగాని పున్నమ్మ కుడిచేతివైపు యింట్లో అద్దెకు దిగిన కుటుంబాన్ని చూస్తే ఆమెకి అరికాలిమంట తలకెక్కుతోంది. వాళ్ళకి యిరుగూపొరుగూ లేదు. మంచీచెడ్డా అసలేలేదు. అలవాటుప్రకారం వాళ్ళ పెరట్లో జొరబడితేచాలు సరిగ్గా



గొడ్డుని బాదినట్టే బాదేస్తున్నారు వాటిని. తన మనవలు వాళ్ళు అరుగుఎక్కితే వాటి బూజులు దులిపినట్టు దులిపేస్తున్నారు. తన మనుషులు, ఏదో స్నేహం కొద్దీ సుమా, సందులోంచి యిలా గడకర్రతో అందుకుంటున్నారో లేదో ఆ యింటి ములక్కాడలు, పట్టుకుని కుక్కని కొట్టినట్టు కొట్టి, పందుల్ని తోలినట్టు తోలేస్తున్నారు.

'బగుమంతుడా! ఈ య్యేదవల్ని సిచ్చించు' అని పున్నమ్మ పోతరాజుకి మొక్కుకుంది. కలడు కలండనెడువాడు 'కలడా, కలడున్నరా!' అనిపించాడు. ఆ యింటికోడలు ఓనాటి అర్ధరాత్రి ఎందుకు లేచిందో ఏమో పెరట్లోకి వచ్చి నూతిదగ్గిర కాలుజారి, అందులో పడి యముడి ముడిలో చిక్కుకుపోయింది. నక్షత్రం మంచిది కాదని మూడునెలల పాటు ఆ అద్దెవాళ్ళు ఆ యిల్లు పాడు పెట్టేశారు. అయితే అంతటితో పున్నమ్మ కష్టాలు గట్టెక్కేలా కనబడలేదు. మూణ్ణెల్లు ఎంతలో అయిపోవాలి! మళ్ళీ వాళ్ళు రారా! మహాలక్ష్మి లాంటి కోడల్ని పోగొట్టుకున్న వాళ్ళు మళ్ళీ ఆ దిక్కుమాలిన యింట్లో అడుగుపెట్టలేమన్నారని విని ఆమె ఎంతో సంతోషించింది. కాని వీళ్లు కాకపోతే వీళ్ళ అమ్మమ్మమొగుళ్లు మూడోనాటికి ఆ యింట్లో నిండిపోరా? అద్దెకి ఇల్లు దొరకడం అమ్మాయికి మొగుడుదొరకడం అంత కష్టంగదా!

నిమషాలమీద మరొకరు వచ్చి ఆక్రమించెయ్యరా! 'దీని కేదో ఒక శాశ్వతమైన ఏర్పాటు చెయ్యాలి' అని నిశ్చయించింది పున్నమ్మ. ఈసారి ఆమె ఎవరిమీదా ఆధారపడదల్చుకో లేదు. 'చాలా కష్టపడ్డావు గని కాస్సేపు రెష్టుతీసుకో' అన్నట్టు భగవంతుడికి సలహా యిచ్చి ఆమె రంగంలోకి దిగిపోయింది.

ఆ తరవాత ఒకరోజు తెల్లవారుఝామునట...చిరు చీకటిగావుందో తెలతెలవారిపోతోందో సరిగ్గా చెప్పలేదుట గాని, పున్నమ్మ కాలవ ఒడ్డుకి వెళ్ళి వస్తూంటే—

'సిట్టెమ్మా దాన్ని సూసేక ఇంక నాకు పేనాలు నేవే ... తెల్లటికోక ... మొగన్నిండ యింతెత్తుని పసుపు...రకతం ముద్దనాగ అంత బొట్టు...అంత పొడుగున యిరబోసుకున్న జుత్తు...ఓలమ్మో యిప్పుడు సూస్తున్నట్టు ఒల్లు ఒనికిపోద్ది ... గల్లుగల్లు పట్టీలసప్పుడు ... మా పాకకి పాలకి ఒచ్చేదిగదూ అదే సప్పుడు...పకపక నవ్వుతూ ఎల్లిగమ్మని నూతిలో ఉరికిందే మాయమ్మో'

తెల్లవారిలేచి ఎవరినోట విన్నా ఇదే మాట—

'సందేహ మేమిటీ, ఆ యింటి కోడలే అదీ!'

'పున్నమ్మగాబట్టి నిలబడగలిగింది గాని మరొకరయితే అక్కడికక్కడ రక్తం కక్కుకుని చచ్చి ఉందురు!'

'అయితే పాపం కోడల్ని అత్తగారు నూతిలో తోసేసిందన్నమాట!'

'ఎంత ఘోరం! లేకపోతే అప్పటప్పుడు యిల్లు ఖాళీచేస్తారా?'

'బాగా చెప్పేరు! అయితే ఎందుకు చంపేశా రంటారు?'

'ఏమో కోడలికీ మావగారికీ సంబంధం ఉందేమో! ఆ సంగతి అత్తగారి కళ్ళ పడిందేమో!'

లోకం సూక్ష్మబుద్ధికి లోలోన పున్నమ్మ ఎంతో ముచ్చటపడింది. ఆ ఇల్లు సాంబయ్య అనే రిటైర్డు హెడ్ క్లర్కుది. ఏభై రూపాయిలకి అది అద్దెకిచ్చి వేరే కొత్తపేటలో యిరవై రూపాయిలకి చిన్న యిల్లు తీసుకున్నాడాయన. ఆయన గట్టి ప్రయత్నం చెయ్యగా మూడోనెలలో కాబోలు యిద్దరు స్టూడెంటుకుర్రాళ్ళు ఆ యింట్లో దిగేరు. ఎంత ఉక్కబోసినా మేడమీద గదిలో లోపల తలుపేసుకుని పడుకుంటారుగాని పీకపోయినా డాబామీదకి రారు. వచ్చినా కిందకి చూడరు. ఏ కారణంచేతైనా కరెంటు కొంచెసేపు ఆగిపోతే ఆ కొంచెసేపూ వాళ్ళ గుండెలు కొట్టుకోవు.

అందులో ఒకడికి గాలికి కొబ్బరి చెట్టు మట్టలు చప్పుడు చేస్తూంటే కింద ఎవరో కిరకిర తలుపులు తీస్తున్నట్టు భ్రాంతి కలిగింది. అర్ధరాత్రివేళ వీధి గుమ్మంలో కుక్క ఒకటి 'కుయ్యో' మని కూనిరాగం తీస్తే 'అయ్యో' అని

అతిదీనంగా ఆరదొకతె ఆక్రందనం చేసినట్టు వినిపించిందని అతను చదువుతున్న డిటెక్టివ్ పుస్తకంమీద ఒట్టు పెట్టుకుని రెండో కుర్రాడు చెప్పేడు. ఏమయితేనేం మర్నాడు ఉదయానికి యిల్లు ఖాళీ అయింది. ఆ పక్కయింటివాళ్ళు సహితం 'ఎప్పుడేం కంటబడుతుందో' అని హడలి చస్తున్నారు.

సాంబయ్యగారి భార్య అయిదేళ్ళయి మరణించింది. ఇంట్లో పనికుర్రాడే యింత ఉడికించి పారేస్తాడు. ఆయనకి చదువుకుంటున్న ముగ్గురు కొడుకులున్నారు. 'బాబుగారూ! చూశారా? దెయ్యాలంటే మీరు కొట్టిపారేస్తారు. ఆ అపనమ్మకమే మీ కొంప తీసింది... వెంటనే వెళ్ళి మాంత్రికుడు పరాంకుశం గారిని కలుసుకోండి' అని పనికుర్రాడు సలహా యిచ్చాడు. సాంబయ్య మంచివాడేగాని లోకజ్ఞానం లేనంత వెర్రివాడేంకాదు. తనకి దెయ్యాలమీద నమ్మకం లేకపోవచ్చు. కాని తనయింట్లో దిగే వాళ్ళకి ఆ ధైర్యం ఉండాలిగదా! పోనీ ఆ పరాంకుశం చేతిలోనే ఏదోపెట్టి ఆ యింట్లో దెయ్యం లేదనిపిస్తే!

ఆయన తను అనుకున్నంత అందుబాటులో లేడని సాంబయ్య పరాంకుశాన్ని చూడగానే పోల్చుకున్నాడు. తీర్థప్రజలా ఉన్నారు అక్కడ జనం. మూడువందలు విజిటింగు ఫీజుగా ముందు చెల్లించాలి! మనుషుల భయాలమీదా బలహీనతల మీదా రీసెర్చి చేసి ఆయన యీ మధ్యనే డాక్టరేటు పుచ్చుకున్నాడు. 'ప్రేతభయంకర' బిరుదు బాగ లేదని 'ప్రొఫెసర్ ఆఫ్ ఘోస్టాలజీ' అనే బోర్డు ఒకటి భక్తుడొకడు స్వయంగా రాసి ఆయనకు అర్పించుకున్నాడు. ఇద్దరు ఆడపిల్లలకీ రెండేసి వేలు చొప్పున లంచాలు కట్టి అత్తారిళ్ళకు ట్రాన్స్ఫరు చేయించుకున్నాడాయన. ఏదో, తనూ ఓ దెయ్యం అవకముందే సొంత యిల్లొకటి లేపుకోవాలని ఆయన ఆలోచన. సాంబయ్యతో చేసిన ఇంటర్వ్యూవల్ల అతని యిల్లు తనదే అనిపించింది ఆ క్షణాన పరాంకుశానికి.

ఓ గంటసేపు ఆ యింటి మేడమీది గదిలో ఆ అసురసంధ్యవేళ ముగ్గులు వేసి మంత్రాలు చదివి భళ్లున తలుపు తీశాడు.

'మీరేం చెప్పొద్దు ... దెయ్యం లేదని రుజువు చేశానని చెప్పండి. మీకు నూట పదహార్లు యిస్తాను' అన్నాడు సాంబయ్య అతి మెల్లిగా. వీధిలో చేరిన అశేష జనాన్ని చూసి భయపడుతూ పరాంకుశం ముక్కుమీద వేలేసుకున్నాడు. చల్లగా చీవాట్లు పెట్టేడు.

'తప్పు నాయనా! నన్ను దూషించు. శాస్త్రాన్ని శంకించకు. సత్యస్వరూపులయిన ఆ అమాయిక ప్రజ ముందు యీనాడు నేను నీ రూపాయలకి గడ్డితిని బొంకినా రేపొద్దుట ఆ సర్వాంతర్యామికి

ఏం జవాబు చెప్పను ! చూడు నాయనా నువ్వేచూడు, చెదిరిన ఆగరికమీద కనీ కనిపించని ఆ పాదాల గురుతులు చూడు. రివ్వుమని జువ్వివేసే సవ్వడి విను దాని మీద వాలింది రాబందులాగుంది చూడు. నీచగ్రహానికి యివన్నీ నిదర్శనాలుకావా?'

'ఇంతెందుకు బాబుగోరూ! ఆ దెయ్యం కొబ్బరిసెట్టు సూడండి ఆమునగసెట్టు సూడండి ..మునపు యింతేసి కాయలు దిగేవి యిప్పుడు పువ్వు నల్లగా మాడి పోవలసిందేగాని యింత పిందె దిగదే! ఏటంటారు?' అని పున్నమ్మ శ్రుతి కలి పింది సాంబయ్య అడిగేడు 'పరాం కుశం బాబూ ! ఈ దెయ్యాన్ని యిక్కణ్ణుంచే పంపించెయ్యలేరా?'

'సాధువుల్ని చెయ్యవచ్చుగాని సతీ పిశాచాన్ని స్థానభ్రంశం చెయడం సాధ్యం కాదు నాయనా ! మనకు ఒకపిశాబ్దం పిశాచమాన ప్రకారం ఒక్క ఏడాదికి సమానం పదేళ్ళయినా పీడించందే యిక్కణ్ణుంచి వెడలకొడపడం అసం భర్భం నాయనా !'

చీకటిపడింది అక్కడ మూగినవాళ్లు ఒక్కొక్కళ్ళే జారుకున్నారు సాంబయ్య అనుకున్నదొకటీ జరిగిందొకటీ .. తింటూ తింటున్న కూటిలో మన్ను పడి పోయింది ముగ్గురు పిల్లల చదువులు జరగాలి ఎలాగో యీడ్చుకు వస్తున్నాడు యీ అద్దెరాళ్ళతో. ఇకముందు ఎలా బత కాలి! లోకంమీద చెప్పలేని కసి ఏర్ప డింది అతని కాక్షణంలో ఏం తప్పు చేశాడని తనకి యీ శిక్ష?

'ఈ వీధివాళ్ళకీ యీ ఊరివాళ్ళకీతప్ప యీ కబురు తెలియదుగదా! పై ఊరి వాళ్ళ కెవరికైనా ఎంతొస్తే అంతొస్తుం దని అమ్మేస్తే?'

'నాయనా! నీ అవస్థ నీ లాంటి యోగ్యుడిచేత అలాంటి మాట అనిపి స్తోంది. ఒకరు బాధపడితే ఒకటీ మనం అయితే ఒకటీనా తండ్రీ! కానీ నాకు యిబ్బంది అయితే అయింది. నీకు అభ్యంతరం లేకపోతే యీ యిల్లు నేనే కొనుక్కుంటాను.'

సాంబయ్యకి ఏదో అనుమానం పుట్టు కొచ్చింది

'నీ అనుమానం నేనెరుగుదును నాయనా! మంత్రవిద్యలు ఎరిగినవాళ్ళం. శాస్త్రాలు తిరగేసినవాళ్ళం. ఈ క్షుద్ర శక్తుల మమ్మల్నేం చెయ్యగలవు!'

సాంబయ్యకు కొత్త సత్యమేదో తెలిసినట్టయింది పరాంకుశంగారింట్లో అతనూ పెళ్ళామూ తల్లీ వైధవప్పగారూ కాక యింకా అయిదుగురు పిల్లలున్నారు ఇంట్లో యింతమందిలో ఏ ఒక్కర్నీ యీ యింట్లో ఉన్న పిశాచం యేం చెయ్యదా? అందరికీ శాస్త్రజ్ఞానం ఉన్నదా! తన జ్ఞానోదయం ఏమాత్రం బయటపెట్టకుండా,

'బాబూ అంతకంటె కావలసిం దేముంది? తమరే ఏదో రేటు...'

'ఇన్ని మాటలు నా దగ్గిర ఉండవు నాయనా! రెండువేలు యిస్తాను...కాళ్ళు దన్నుకోకు...దెయ్యాలకొంప...నువ్వు ఉత్తినే యిచ్చినా ఎవడూ పుచ్చుకోడు— ఆలోచించుకుని రేపు సాయంకాలంలోగా కబురు చెయ్యి వస్తానుమరి...అక్కడ భక్తుల్తో యిల్లు విండిపోయి ఉంటుంది'

పరాంకుశం వెళ్ళిపోయాడు. ఆ మాటలతో సాంబయ్యకి యింకేమైనా సందేహాలుంటే అన్నీ పటాపంచలయిపోయాయి. పదేళ్ళకిందట ఏడువేలకి ఆ యిల్లు కొన్నాడు తను మూడువేలు ఖర్చుపెట్టి డాబా. మేడమీద గదీ వేయించాడు. ఇంతకంటె చిన్నది, వెనక పెరడూ పైన డాబా లేనిది, సరిగ్గా దీనికి ఎదురుగా ఉన్న యిల్లు మొన్న మొన్ననే యిరవై వేలకి బతిమాలి కొనుక్కుపోయారు! తన యిల్లు రెండు, రెండంటే రెండువేలా! 'ఈ ఇరవైయో శతాబ్దంలోకూడా నీ కింత పలుకుబడి ఉందా దెయ్యమా! నీ ఖరీదు మరీ అంత హెచ్చా!' అని ఆ చీకట్లో ఆ డాబామీద కూచుని పకపక నవ్వుకోబోయిన సాంబయ్య గజగజ వణికిపోయాడు. ఎవరో జుత్తు విరబోసుకున్న ఎర్రకళ్ళ తెల్లచీర ఆడమనిషి మెట్లెక్కి తన దగ్గిరకు వస్తోంది! ఆతని భయాన్ని చూసి పున్నమ్మ పకపక నవ్వుతూ, తనెవరో చెప్పుకుని 'సూశావా బాబూ! ఏటో పెద్ద కపుర్లు సెప్పినోవు. నువ్వీయిల్లు తెగించి వొవడికయినా అద్దెకియ్యి, లేదా అమ్మిచూడు, ఆర్నెల్లు దాటకుండా ఆ కుటమానం కుటమానం బుగ్గి అయిపోకపోతే సూడు. ఆడినలా సేస్తే పిల్లతోడివి నీ సంసారం లెగుస్తదా? దిక్కునేలోల్లం కాబట్టి మానాంటి పేనాలం బితుకూ బితుకూమంటూ యీ సుట్టుపక్కల ఆగొడ్లతో కలిసిపోయి యీడుసుకొత్తన్నాం'

తనకంటికి ఆ రాత్రి పక్కింటి కోడలు దెయ్యం ఎలా కనబడిందో అంతా మరోసారి కళ్ళకుకట్టినట్టు వర్ణించి మరీ వెళ్ళింది పున్నమ్మ.

పరాంకుశం యింట్రస్టు తెలుస్తూనే ఉంది. ఇంతలా ఆపేక్ష చూపించి హెచ్చరిస్తోందే యిందులో పున్నమ్మ పాత్ర ఏమైఉంటుంది? వరసగా రెండ్రోజులు తనయింటివైపు చాటుగా చూసిరండని కొడుకుల్ని పంపిన తరువాత మరొకసారి సాంబయ్యకి కళ్ళు విడ్డాయి. పెరటివైపు తలుపు ఎప్పుడో విరిచేశారు. పున్నమ్మ పశువులు స్వేచ్ఛగా తన పెరట్లో తిరుగుతున్నాయి. వీధివైపు తాళం వేసినతలుపుకి ఒక చెక్క ఊడదీసి ఉండడం ఇదివరకే చూశాడు తను అందులోంచి పున్నమ్మ మనుషులు లోపలికి దూరి మెట్లెక్కి డాబాఎక్కి బట్టలు ఆరేసుకుంటున్నారు. ఇంటికి కావలసిన నీళ్ళన్నీ పున్నమ్మ మేనగోడలు తన నూతినుంచే సప్లయి చేస్తోంది తన నీధి

అరుగుమీదే పున్నమ్మ మనవలు ముప్పొద్దులా దినం తీర్చుకుంటున్నారు

ఇంతమందిలో ఏ ఒక్కర్నీ కామినీ పిశాచం ఏమీ చెయ్యదా?! వెంటనే ఒక నిర్ణయానికివచ్చి, సాంబయ్య మొహం ఇన్నాళ్ళకు మళ్ళీ వెలిగింది.

సాంబయ్య, పెట్టె గడువులోగా పరాంకుశానికి యింటిమాట కబురు చెయ్యలేదు సరిగదా అక్కణ్నుంచి కబురొస్తే కసిరి పంపించేశాడు. శివరాత్రి అమావాస్య తెల్లవారే సరికల్లా తన ముగ్గురి కొడుకులతో అద్దె ఇల్లు ఖాళీ చేసి స్వంతయింట్లో వచ్చి దిగిపోయారు. పరాంకుశ్రాణ్ణి మాత్రం ఎంత బతిమాలినా దెయ్యానికిజడిసి రానుపొమ్మన్నాడు.

ఆ రోజు రాత్రి ఒంటిగంటా రెండు గంటలమధ్య. కన్ను పొడుచుకున్నా కనబడని కాటుక చీకటి. ఆ వీధిచివరికి ఎలక్ట్రిక్ పోల్ ఒకటి లేకపోలేదుగాని దానికున్న బల్బు – పోయిన గాలివానలకి ఆ తీగెలు ఏం దెబ్బతిన్నాయో ఏమోమరి వెలుగుతూ ఆరుతూ ఊగుతూ ఉంటుంది.

పున్నమ్మ 'మాయలమారి' సినిమా రెండోఆట చూసివస్తోంది. 'ఎడవలు... కూకుని బొక్కమంటే అందరూ సిద్ధమే యిల్లు సూడమంటే అందరూ ఆ అరికతకి అగోరించాసు గావాల.'

పున్నమ్మ దూరంనుంచే పేరుపేరున పిలిచింది. పాకనుంచి ఎటువంటి జవాబూ రాలేదు.

'గొడ్లు ఏటయిపోనాయో యేటో...' అని ఆ దీపం వెలుగులో ఒక్కసారి చూసింది పున్నమ్మ. పక్కింటి పెరటి గుమ్మం కనిపించింది. 'ఎంత్రిబామ్మడు.... ఈ పున్నమ్మ తడాకా ఎరగడు గావాల్న...' పున్నమ్మమాట ఆమె లోనే ఉండిపోయింది... గలగల పట్టీల చప్పుడు ఆమె గుండె కొట్టుకుంది... అదే... అదే... పక్కింటికోడలు తనింటికి పాలకొచ్చేది. అదే పాదాల పట్టీల చప్పుడు. మళ్ళీ మళ్ళీ వినబడింది. పున్నమ్మ రెండడుగులువెనక్కి వేసిం నాలిక పొడారిపోగా అటే చూస్తూ! పెరటి గుమ్మంలోంచి తెల్లని ఆకారం... ఇటే వస్తోంది... మొహమంతా పసుపు... పెద్దబొట్టు... తెల్ల చీర... విరబోసుకున్న జుత్తు...అరుద్దామనుకున్నా పున్నమ్మ నోట మాట పెగల్లేదు. గలగల నడుస్తూ తన పాకలోకి, తన పాకలోకే వెళ్ళిపోయింది! గేదెలన్నీ దీనంగా అరిచాయి. గేదెల రాణి పున్నమ్మ ఘోరంగా అరిచి, తెలివి తప్పి పడిపోయింది!

నలుగురూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని అక్కడ చేరేలోగా పాక అవతలివైపునుంచి ఆ దెయ్యం పరిగెత్తి గబగబా పెరటి గుమ్మంలోంచి సాంబయ్య యింట్లోదూరి, వేషమూ, విగ్గూ, పట్టీలూ గబగబా విప్పేసి 'నాన్నా యీ మాట వేరేపెట్టు ...రేపు



నాటకం కంపెనీవాళ్ళ కిచ్చేద్దాం' అని రెండో కొడుకు రూపంలో సిద్ధమయింది.

మర్నాడు మధ్యాహ్నం పన్నెండు గంటలయినా పున్నమ్మ తన పాకలోకి వెళ్ళడానికి సాహసించలేదు. జ్వరం తగ్గేవరకూ చిట్టెమ్మ పిన్ని గుమ్మం దిగలేదు. ఆమే, ఆమె పటాలమూ, ఆమె పశు సమూహమూ మళ్ళీ ఆ వీధి మొహం చూడలేదు. మరో రెండు నెలలకి పున్నమ్మ పాక పక్కని మరో పెంక దింపుకుని, ముందు జాగా చుట్టూ దడి కట్టుకుని, సాంబయ్యా పిల్లలూ క్రమంగా అక్కడికి చేరుకున్నారు. ఇల్లు బాగు చేయించుకుని యీ మధ్యనే ఎవరికో డెబ్భైఅయిదుకి అద్దెకిచ్చారుకూడా.